క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ అండ



నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ అండంగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రాను ఏపీ మాదిగ వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీవో 246 జారీ చేసింది. ఈ మేరకు కందుల ఎజ్రా నాయకత్వంలో పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు శనివా రం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గోపిరెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలియచేయడంతో పాటు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. నూతనంగా డైరెక్టర్ పదవిని పొందిన ఎజ్రాను సన్మా నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. డైరెక్టర్ కందుల ఎజ్రా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం జగన్, ఎమ్మెల్యే గోపిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎస్.సుజాతపాల్, ఈ.ఎం. స్వామిమాస్టర్, వైఎస్సార్ సీపీ నాయకులు పంగులూరి విజయ్‌కుమార్, జి.అచ్యుతరావు, జి.గాబ్రియేల్, నాయకులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందన



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని షేక్ అమీరున్నీసాబేగం ఏపీ పీజీ సెట్ తెలుగు విభాగంలో 6వ ర్యాంక్ సాధించింది. కళాశాలలో బీఏ స్పెషల్ తెలుగు చదివిన ఆమెను నెలనెలా సాంస్కృతిక మేళాలో శనివారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త, శ్రీ కన్యాక పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ చలువాది బ్రహ్మయ్య రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఈఓ టి.సుధాకరరెడ్డిని కలసి చెక్‌ను ఆయన అందించారు. ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.5లక్షలు ప్రకటించామని, మొదటి విడతగా రూ.2లక్షలు అందజేసినట్టు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు. ఆదాయపన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు.

వృద్ధాశ్రమాలకు సరుకుల పంపిణీ



నరసరావుపేట ఈస్ట్: శ్రీ వాసవీ మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంధం వెంకటసూర్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీరాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం, సదానంద చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పూనూరి కృష్ణకుమారి, రెడ్డి హరినాథ్ బాబు పాల్గొన్నారు.

అక్రమంగా భారీ చెట్లు నరికివేత ?



రొంపిచర్ల: మండలంలోని మునమాక గ్రామ సమీపంలో ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాల్ని ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం నరికివేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రశ్నించగా ఆర్ అండ్ బీ వారి అనుమతులు ఉన్నాయని చెట్లు నరుకుతున్న వారు వాదోపవాదాలకు దిగారు. దీంతో ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులకు, పోలీస్ స్టేషన్‌కు సచివాలయ అధికారులు సమాచారం అందించారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈని సెల్‌ఫోన్ ద్వారా వివరణ కోరగా... వీఆర్వో సమాచారం మేరకు అక్కడకు చేరుకొని చెట్లు నరకడాన్ని నిలుపుదల చేశామని చెప్పారు. అయితే, అప్పటికే కొంత కలపను అక్కడి బయటకు తరలించారని స్థానికులు తెలుపుతున్నారు.

పథకాలకు రక్ష... జగనన్న సురక్ష



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తదితరులు



విప్పర్లలో సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎండీపీవో, సర్పంచ్ తదితరులు



ములకలూరు గ్రామసభలో రైతులకు విత్తనాలను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: సంక్షేమ పథకాలకు రక్ష .. జగనన్న సురక్ష కార్యక్రమం అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పేర్కొన్నారు. పట్టణంలోని 10,11,12,30 వార్డుల సచివాలయాల వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ రఫాని మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందని వారుంటే వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందించి అర్హుల్ని చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. చిట్టచివరి లబ్ధిదారుడికి కూడా అన్యాయం జరగరాదనే గొప్ప ఆశయంతో సీఎం వైఎస్ జగన్ ఈ బృహత్తర కార్యక్రమానికి నాంది పలికారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, 10,11,30 వార్డుల కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, మానుకొండ మాధవి, షేక్ ఖాజాబాను, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, ఆయా వార్డు ఇన్‌చార్జులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

మండలంలోని విప్పర్ల, ఆరేపల్లి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. ఆరేపల్లిలో 175 సర్టిఫికెట్లు, విప్పర్లలో 192 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎలాంటి రుసుము లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ అంకారావు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో కె. మాధ్యూబాబు, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేష్, ఈవోపీఆర్డీ విజయరాము, సర్పంచులు ఇర్లా వెంకటరత్నం, గోరంట్ల చిన్నఅప్పయ్య, ఎంపీటీసీ సభ్యులు తాడువాయి వెంకటేశ్వరరావు, మోతుకూరు వెంకట్, గ్రామ కార్యదర్శి ఎన్. కోటిరెడ్డి, వీఆర్వో సురేష్, లింగయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు, పమిడిపాడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లతో పాటు రైతులకు కంది విత్తనాల్ని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదుబాబు, ఎంపీడీవో వీరభద్రాచారి, ఏవో సుగుణాబేగం, జెడ్పీటీసీ సభ్యురాలు జడ్డా సుబ్బులు, నూజెండ్ల సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, ఏపీఎం సత్యానందం, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, షేక్ రబ్బాని, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అరవిందబాబు తప్పుడు ఆరోపణలపై న్యాయపర చర్యలు

ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనపై మతిలేని, ఆధారాలు లేని, ఒక్క సాక్ష్యం కూడా లేకుండా అసత్య ఆరోపణలు పదేపదే చేస్తున్నాడని, వాటిపై లీగల్ నోటీసులు జారీచేసి న్యాయపర చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరవిందబాబు తనపై భూముల కొన్నట్లుగా చేసిన ఆరోపణల్ని ఖండించారు. వాస్తవాలను ఈసీ డాక్యుమెంట్ల సహా విలేకర్లకు అందజేశారు. తనకు విజయవాడలోని పోరంకిలో 2.47ఎకరాల భూమి, హైదరాబాదు మేడ్చల్‌లో భార్యపై ఆస్తులు ఉన్నట్లుగా ఆరోపించాడన్నారు. అతని పోరంకిలో 32/2ఏ, 32/2బిలో సాంబశివారెడ్డి పేరుపై ఉన్న ఆస్తి తనదిగా చెప్పాడని ఆరోపించారు. ఆస్తుల సర్వే నంబర్లపై ఐజీ ఆఫ్ రిజిస్ట్రేషన్ శాఖకు డాక్యుమెంట్లు కావాలని కోరగా, వారు వెంటనే వివరాల్ని పంపించారన్నారు. వాటిలో ఆదర్శ బిల్డర్లపై ఒకటి, రెండోది ముళ్లపూడి శృతి, పోతుల రాధ పేర్లపై ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాదు మేడ్చల్‌లో తన భార్య గోపిరెడ్డి సుష్మితారెడ్డికి ఉన్నట్లుగా చెప్పాడని, ధరణి పోర్టల్‌లో సర్వే నంబరు 401/డీ1పై భూమేలేదని స్పష్టం చేశారు. మేడ్చల్‌లో సర్వే నంబరు 398 తర్వాత 405 ఉందన్నారు. తనపై కుమారుడు గోపిరెడ్డి సిద్ధార్థరెడ్డి పేరుపై ఒక భవనం చూపించాడని, అది కూడా విచారణ చేస్తే అతని పేరుపై ఎటువంటి భవనం లేదని రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ వెల్లడించారన్నారు. విజయవాడ పడమట, విశాఖ పట్టణం భీమిలిలో తనకు ఆస్తులు ఉన్నట్లుగా చెప్పాడే కాని సర్వే నంబర్లు చెప్పలేదన్నారు. అవి చెప్పి ఉంటే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వాస్తవాలు తెప్పించేవాడినని వివరించారు. తనకు లేని ఆస్తులు ఉన్నట్లుగా చెబుతున్నాడని, నిరూపిస్తే వాటిని అతనికే రాసిస్తానని చెప్పారు. నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్ విజయకుమార్ ఇంటి ఎదుటనున్న స్థలం సొంత డబ్బులతో 2020లో కొనుకున్నదేనని గోపిరెడ్డి తెలిపారు. తనకు ఆరోగ్యశ్రీ ఉందని, దీని ద్వారా రూ.3.42కోట్లు వస్తే మిగతా డబ్బులు బ్యాంకుల ద్వారా రుణం తీసుకొని తెల్లధనంతో నిజాయతీగా బహిరంగంగానే కొనుక్కున్నానని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన వివరాలు కావాలంటే ఇస్తానని చెప్పారు. పట్టణంలోని 12వ వార్డులో ఒక లారీలో రేషన బియ్యం పట్టుకోవడమనేది టీడీపీ నాయకులు ఆడిన పెద్ద డ్రామాగా పేర్కొన్నారు. అది వారి పార్టీకే చెందిన రేషన్‌డీలర్ అన్నదమ్ముల మధ్య నున్న వివాదమని చెప్పారు. ఆ ప్రాంతానికి చెందిన గ్లోరియస్ శ్రీనివాసరావు రూ.1లక్షను సుబ్బారావు అనే టీడీపీ నాయకుడికి ఇవ్వాల్సి ఉండగా, అతను సుమారు రూ.70లక్షలు విలువైన ఒక ఇంటికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తలుపుల తాళాలు పగులకొట్టి ఆక్రమించే ప్రయత్నం చేశారని వివరించారు. ఇలాంటి వ్యక్తులను పక్కనే కూర్చోపెట్టుకొని అరవిందబాబు తమపై ఆరోపణలు చేయడం దారుణమని ఖండించారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న అరవిందబాబుపై న్యాయపర చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గోపిరెడ్డి హెచ్చరించారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల ప్రత్యేకాధికారి శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి శ్రీరాములు

వినుకొండ(నూజెండ్ల) : ఓటర్ల జాబితాలో సవరణలకు ప్రజా ప్రతినిధులంతా సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి శ్రీరాములు కోరారు. నియోజకవర్గ స్థాయి ఓటరు జాబితాపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన ఓటరు లిస్ట్ స్పెషల్ సమ్మరి రివిజన్- 2024కు సంబంధించి అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే, నమోదుకు సహకరిస్తామని తెలిపారు. ఓటు హక్కు కోరుకున్న ప్రదేశంలో ఉండాలంటే ఆరు నెలల కాలంలో ఓటరు తప్పనిసరిగా కొద్ది రోజులు నివాసం ఉండాలని, లేనిపక్షంలో తొలగిస్తామని చెప్పారు. మరణించిన ఓటర్లతో పాటు ఉద్యోగ రీత్యా బయట ఉంటున్న వారివి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆయన సూచించారు. బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నందున రాజకీయ పార్టీ నాయకులు ప్రజలకు అవగాహన పరచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి తులసీరామ్, ఐదు మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రవల్లిక

నరసరావుపేట టౌన్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. ప్రవల్లిక సూచించారు. శనివారం సబ్‌జైల్‌ను సందర్శించిన ఆమె ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్తోమత లేని వారు సంప్రదించాలని ఆమె తెలిపారు. అనంతరం ఖైదీలకు అందించే ఆహార పదార్థాలు, ఫిర్యాదుల పెట్టెను తనిఖీ చేశారు. ఆమె వెంట జైల్ సూపరింటెండెంట్ రవికుమార్ యాదవ్, సిబ్బంది ఉన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో సాగులో అధిక దిగుబడులు

జిల్లా ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్ డీడీఏ శివకుమారి



రైతులతో మాట్లాడుతున్న డీడీఏ శివపార్వతి

యడ్లపాడు: సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే సాగులో అధిక దిగుబడులు సాధించడం సాధ్యమవుతుందని జిల్లా ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్ డీడీఏ శివకుమారి తెలిపారు. యడ్లపాడు రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. రికార్డుల్ని పరిశీలించి, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ-పంట నమోదును సమర్థంగా అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఆర్‌బీకేల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు.

నూతన వంగడాలు సాగు చేసుకోవచ్చు

వరిలో నూతన వంగడమైన ధీరజ్ రకాన్ని సాగు చేసుకోవచ్చని డీడీఏ శివకుమారి సిఫార్సు చేశారు. ఆర్‌బీకే పరిశీలన అనంతరం ఆమె పచ్చిరొట్ట సాగు చేసిన పంట పొలాల్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాయితీపై పంపిణీ చేసిన పచ్చిరొట్ట, కంది పంట పొలాల్ని సందర్శించి అక్కడి రైతులతో మాట్లాడారు. భూమి లోపలి పొరల్లో మొక్కల వేర్లకు అవసరమైన తేమ నిల్వ ఉండటానికి ఎకరాకు 5కేజీల వామ్ మందును పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టులో కలిపి చల్లుకోవాలన్నారు. ఇకపై రైతులు జీవన ఎరువుల కోసం బయోలాజికల్ ల్యాబ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా అవి ఇళ్లకు వచ్చేలా పార్సిల్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, నాదెండ్ల ఏవో హరిప్రసాద్, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

రైతులకు మెలకువలు తెలియజేయాలి

నాదెండ్ల: ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయశాఖ సహాయకులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు ఎప్పటికప్పుడు మెలకువలు తెలియపరచాలని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం. శివకుమమారి చెప్పారు. నాదెండ్ల మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల సహాయకులతో ఖరీఫ్ సమాయత్తంపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి, మిర్చితో పాటు కంది, అపరాలు, ఇతర పంటల ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. అధిక ఎరువులు, రసాయనిక పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించడం తప్పనిసరి



నర్సరీ యజమానులకు లైసెన్స్‌లను అందజేస్తున్న ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్

వినుకొండ(నూజెండ్ల): నర్సరీ యజమానులు చట్టంతో పాటు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ తెలిపారు. నూజెండ్ల మండలంలోని యోగిరెడ్డిపాలెం, తంగిరాల పరిధిలో షేడ్‌నెట్ నర్సరీల్ని ఆయన క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. షేడ్‌నెట్ చుట్టూ 9 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్‌తో రక్షణ కల్పించాలన్నారు. షేడ్‌నెట్ హౌస్‌లో డబుల్ డోర్ సిస్టం ఉండాలని, కీటకాలు లోపల ప్రవేశించకుండా ఎక్కడా రంధ్రాలు ఉండకూడదని సూచించారు. మిరప విత్తనాల్ని పోట్రేలలో నాటి, వాటిని ఎత్తయిన మడులపై అమర్చాలన్నారు. పోట్రేలలో శుద్ధి చేసిన కోకో పీట్ మాత్రమే వాడాలని చెప్పారు. కోకో పీట్‌ను శుద్ధి చేయడానికి కేజీ ట్రికోడెర్మా విరిడి, కేజీ సూడో మోనాస్ కలపాలని సూచించారు. నాణ్యమైన నారును రైతులకు అందించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చింపివేతపై కేసు నమోదు

బొల్లాపల్లి: వైఎస్సార్ సీపీ బ్యానర్లను ఆగంతుకులు చించివేసిన ఘటన బొల్లాపల్లిలో జరిగింది. పార్టీ నేతలు బొల్లాపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత నేత రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తులే ఫ్లెక్సీలను చించివేశారంటూ వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు షేక్ ఖదీర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బండ్లమోటు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసుల్ని కోరారు.

ఇండియన్ ఒలింపియాడ్‌లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

నరసరావుపేట రూరల్: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో పాలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇండియన్ సైన్స్ ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని కె.బాజీప్రియ రాష్ట్రస్థాయి 8వ ర్యాంకు, టి.భవ్యశ్రీ 10వ ర్యాంకు, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో సీహెచ్. వర్షిణి 25వ ర్యాంకు, సోషల్ ఒలింపియాడ్‌లో ఎస్. ఫిలిప్ డానియల్ ఎక్సలెన్స్ అవార్డును సాధించారు. దీంతో పాటు 18 మంది విద్యార్థులు బంగారు, 18మంది వెండి, 18మంది కాంస్య పతకాలు సాధించారు. ఉపాధ్యాయిలు జ్ఞానేశ్వరి, వై.సునీత ఇండియన్ టాలెంట్ బెస్ట్ టీచర్ అవార్డులు పొందారు. విద్యార్థుల్ని పాఠశాల హెచ్ఎం ఎ.వి. విజయకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాలో అర్హత సాధించిన అభ్యర్థులతో నిర్వాహకులు

వినుకొండ టౌన్: తమ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించడమే కాకుండా 105 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ శనివారం తెలిపారు. జాబ్ మేళాలో బోయపాలెం వద్దనున్న పెప్సీ కంపెనీ డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.ఏ. హుమాయూన్, చిత్తూరు వద్ద నున్న అమరరాజా బ్యాటరీస్ కంపెనీ నుంచి జి. పవన్‌కుమార్, పేరేచర్ల వద్దనున్న జోసిల్ కంపెనీ హెచ్‌ఆర్ ఆర్. హరికృష్ణ, ఐఎంఐఎస్ ఫార్మస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి టెక్నికల్ టీం హెడ్ మల్లేశ్వరరావు, ఐఎఫ్‌బీ సర్వీస్ సెంటర్ మేనేజర్ త్రిసూల్‌రెడ్డి, విజయవాడ ఆల్ ఇండియా రేడియో స్టేషన్, దూరదర్శన్ నుంచి ఇంజినీర్ ఎస్. కోటేశ్వరరావు, బెంగుళూరులోని ఏఈఆర్ఓ. స్పేస్ పార్ట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీ నుంచి మేనేజర్ ప్రదీప్ హాజరయ్యారని పేర్కొన్నారు. జాబ్ మేళాకు 130మంది అభ్యర్థులు హాజరు కాగా 105మంది ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జానకి, కాలేజీ సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి

బొల్లాపల్లి: పాఠశాలల్లో నాడు- నేడు పనుల్ని త్వరతగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాడు-నేడు పనులు, పాఠశాలల నిర్వహణ, బోధనలపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ పనులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, నాణ్యతతో చేయాలని సూచించారు. డ్రాప్ అవుట్స్ విద్యార్థుల్ని తిరిగి పాఠశాలల్లో చేర్చేందుకు కృషి చేయాలని చెప్పారు. జగనన్న గోరుముద్దను పటిష్టంగా అమలు చేయాలని, మెనూను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. సమీక్షలో ఎంఈఓ-2 కె. పార్వతి, విద్యా సంక్షేమ ఇంజినీరింగ్ సహాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యం

నరసరావుపేట రూరల్: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. శాఖల వారీగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని అధికారులు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాసిన్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా 32 పనుల్ని రూ.24కోట్లతో చేపట్టనున్నట్టు తెలిపారు. టెండర్లు దశ పూర్తయిందని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఉప్పలపాడు, కేఎం అగ్రహారం గ్రామాల్లో బోర్లు పని చేయడం లేదని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి అవసరాల నిమిత్తం కాలువలకు నీటిని విడుదల చేస్తారని ఎన్‌ఎస్‌పీ అధికారులు సమాచారం ఇచ్చారని, గ్రామాల్లోని చెరువుల్ని నింపే విధంగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా గత మూడేళ్లలో మండలంలోని 1747 డ్వాక్రా గ్రూపులకు రూ.35కోట్లు చెల్లించినట్టు ఏపీఓ భరత్‌కుమార్ తెలిపారు. కంది విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం 100శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు తెలిపారు. వారంలో ఈ-పంట నమోదు ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేసుకునేలా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన 21 గ్రామాల్లో రూ.3.6కోట్లతో అభివృద్ధి పను లు చేపట్టినట్టు పంచాయతీరాజ్ శాఖ డీఈ హర నాథ్ తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నిధుల నుంచి రూ.1.10కోట్లతో మండలంలోని పనులు చేపట్టినట్టు ఆయన వివరించారు. సమా వేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీడీఓ ఎన్.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యులు కూడా తక్కువ మంది హాజరవ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదుగురు సభ్యుల కోరం లేక సమావేశాన్ని ఆలస్యంగా ప్రారంభించడం గమనార్హం.

వన్య ప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత



పాములను పట్టే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్నేక్ సొసైటీ సభ్యులు

వినుకొండ టౌన్: వన్య ప్రాణుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) ఎస్. రామచంద్రరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని గుడ్ షెపర్డ్ పాఠశాలలో విద్యార్థులకు ఈస్టన్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పాముల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్ఓ మాట్లాడుతూ మూగ జీవులపై ప్రతి ఒక్కరూ జాలిని చూపాలన్నారు. ప్రధానంగా విష సర్పాలపై సరైన అవగాహన కలిగి ఉంటే, ప్రాణాపాయస్థితి నుంచి బయట పడవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టర్ ద్వారా విద్యార్థులకు పాములపై అవగాహన కల్పించడమే కాకుండా పట్టే విధానంపై నేరుగా డెమో నిర్వహించారు. కార్యక్రమంలో మూర్తి, రేంజర్ సయ్యద్ హుస్సేన్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: మున్సిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు లభించినట్టు ప్రధానోపాధ్యాయిని ఎం.సులేఖ శనివారం తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన తమ విద్యార్థినులు షేక్ తస్లీన్ కౌసర్, కె.ఎస్.ఏ.వరలక్ష్మి, ఏ.పాప, ఐ.ధనలక్ష్మి, షేక్ మెహ్రాజ్, ఆర్.హర్షిత, షేక్. విద, జి.రేణుకమంజరి, జె.తనూశ్రీ ఐఐఐటీకి ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థినుల్ని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో బహుమతులు



విద్యార్థులతో పీఈటీ నీలయ్య

నాదెండ్ల: స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో గణపవరం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు రెండు విభాగాల్లో బహుమతులు సాధించారు. పాఠశాల నుంచి సుమారు 23 మంది విద్యార్థులు ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ స్పోర్ట్స్ మీట్‌కు హాజరయ్యారు. అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి షేక్ అప్సాపురం అర్షద్ లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో బ్రాంజి మెడల్ సాధించాడు. 8వ తరగతి విద్యార్థిని బాలశ్రీవల్లి 400 మీటర్ల రన్నింగ్‌లో నాలుగో స్థానాన్ని సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణి, పీఈటీ నీలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. విజేతలైన విద్యార్థులు త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరవుతారని పీఈటీ నీలయ్య తెలిపారు.